కథానిక

కోటీశ్వరుడు

రచన: అలెగ్జాండరు కుప్రిన్

అనువాదం: "ఫల్గున్"

కుగ్రామమైన ఒక కొసిన్లో క్రిస్‌మస్ పండుగల మూడోరోజు సాయంకాలం. రాకిటిన్ ఇంటివద్ద అనేకమంది అతిథులు పోగయారు. రాకిటిన్ ఒకానొక పోస్టాఫీసు ఉద్యోగి—బ్రహ్మచారి.

ఆ ఇంటిలో ఉండే పెద్దగదులు రెండూ ప్రత్యేకమైన పేర్లతో విరాజిల్లుతున్నాయి. ఒకటి 'రిసెప్షన్ రూమ్' రెండవది 'బెడ్ రూమ్'!

గౌరవ అతిథిస్థానంలో పోస్టాఫీస్ మేనేజరు షిమిడ్ ఆసీనుడయ్యాడు. బాగా లావెక్కిన అతని శరీరం నీటితో నిండి ఉన్నట్టుగా ఉంది పాలిపోయిన అతని ముఖంలో ఉదాసీనభావం కనబడ్తూంది. అతనికి ఇరువైపులా ఫాదర్ డికాన్ వేసలీ, విందు ఏర్పరచిన ఆసామీ ఒకరికొకరు ఎదురుగా కూర్చున్నారు

రాకిటిన్ ఉత్సాహపూరితంగా కనబడుతున్నాడు. అతని కళ్లలో మిలమిలా కాంతి మెరుస్తూంది.

ఇతర స్థానాల్లో అసిస్టెంటు పోలీసు ఇన్‌స్పెక్టరు పావలోన్, అతనికి ఎదురుగా ఒకాయన పొడుగ్గా వేలాడే జుత్తుతో ఒకానొక యోగి ఆకృతిని దాల్చి కూర్చున్నాడు. అతన్ని అందరూ మాస్టరుగారు అని పిలుస్తారు. టేబిల్ చిట్టచివరను ఆగీపావిచ్ మాలిగన్ ఆశ్రయించాడు. పిరికితనంచేతనూ, ప్రజలకు దూరంగా ఉండే స్వభావం కలవాడవడంచేతనూ మాలిగన్ ఎప్పుడూ వెనక స్థానాల్లోనే ఉంటాడు అతడు కూడా ఒక పోస్టాఫీసు ఉద్యోగే.

మాలిగన్ సాధ్యమయినంతవరకు ఇతరుల ఇళ్లకు విందుకు వెళ్లడం తప్పించుకుంటాడు. అందువల్ల వారిని తిరిగి తన ఇంటికి విందుకు పిలవాలనే భయం అతనికి ఉండదు. ఆఫీసులో అందరికన్న ఎక్కువ వేతనం తెచ్చుకుంటున్న ఉద్యోగి మాలిగన్. అదీగాక, ఆయన తన భార్యను, ముసలి అత్తగారిని, మరి ఐదుగురు పిల్లల్ని పోషించవలసిన బాధ్యతకూడా వహిస్తున్నాడు వారందరికీ తిండీ గుడ్డా ఇచ్చి పోషించవలెనంటే నెలకు తనకు వచ్చే పాతిక రూబెల్సు ఏవిధంగానూ సరిపోయేవి కావు.

టేబిల్ దగ్గర కూర్చున్నాడేగానీ, మాలిగన్ చాలా కంగారు పడుతూ పూర్వంకన్న ఉదాసీనంగా కనబడుతున్నాడు. వణుకుతూన్న తన చేతుల్ని నలుపుకుంటూ తన అవసరం తీర్చుకొని పోదామని సమయం కోసం చూస్తున్నాడు. అనవసరమైన ఆందోళన, అర్థంకాని బాధతో ఆయన తనకిచ్చే వస్తువుల్ని నిరాకరిస్తున్నాడు. తనవల్ల ఇతరులకు ఖర్చు అధికం కాకూడదనే దరిద్రుని తెలివి, అసందర్భమైన భయం ఆయన్ని ఆవరించాయి.

అతిథులు బాగా తిని త్రాగి విందారగించారు. కొంతసేపటివరకు వారికబుర్లు నిర్జీవంగా ఉండినాయి. ఒకానొక భూస్వామిని గురించి, జిల్లా పోస్టల్ ప్రధానోద్యోగిని గురించి, ఊళ్ళోని బిషప్పును గురించి, వచ్చే సంవత్సరం పంటను గురించి వారి సంభాషణ సాగుతూంది.

సంభాషణ మధ్యలో మూడు నాలుగు సార్లు అనుకూలంగా తోచి మాలిగన్ పోలీసు ఇన్‌స్పెక్టరు వైపుకు ఓమారు, మాస్టరుగారు ప్రక్కకు ఓమారువంగి మామూలు మాటల ధోరణిలోనే తనకు చేబదులు ఇవ్వగలరేమో అడుగుదామనుకున్నాడు.

క్రమక్రమంగా సంభాషణ ఈరోజుల్లో బ్రతకడం ఎంత కష్టమయిపోతున్నదీ విచారించడానికి దిగిపోయింది. ఈ సంభాషణలో అందరూ పాల్గొనడానికి అవకాశం ఏర్పడింది. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాన్ని వెల్లడి చేస్తున్నారు.

"మీరెన్ని చెప్పండి, ఈరోజుల్లో అన్నిటికన్న ప్రధానమయినది డబ్బు. డబ్బొక్కటే."

"ఒకప్పుడు నేను భాగ్యవంతుణ్ణి కావాలసిన అవకాశం వచ్చింది కాని ఇంతలో చెయ్యి జారిపోయింది" అని షిమిడ్ తన అనుభవాన్ని వర్ణిస్తున్నాడు.

"కొందరికి లాటరీలలో డబ్బుకలిసి వస్తుంది!" అన్నాడు ఫాదర్ డికాన్. ఒక నిట్టూర్పు విడుస్తూ 'ఇంటర్‌నేషనల్ లోను' టిక్కెట్టు ఒకటి అతడు కొన్నట్టు అందరూ ఎరుగుదురు.

"ఒకానొక భాగ్యవంతుడు లాటరీలో 200 మిలియన్లు గెలుపొందినట్టు పేపర్లో చదివాను. చూశారా, ధనం మళ్ళీ ధనంలో పొర్లాడుతుండే భాగ్యవంతుని దగ్గరికే చేరింది. అదే ఒక పేదవానికి వచ్చియుంటే ఎంత పెన్నిధి! భగవదిచ్ఛ ఎంత అసమంజసంగా ఉన్నదో!"

"అవునవును. ఓ సారి లాటరీలో గెలుపొందిన వారు రెండవసారి కూడా గెలవడానికి కష్టమేమీ లేదని అంటారు. ఆ మాట నిజమే అనుకుంటాను" అన్నాడు మాస్టరుగారు. బొంగురు గొంతుకతో తడబడుతూ "అలాగంటారు కాని అది సంభవమేనని నేను నమ్మలేను" అన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టరు.

నెమ్మదిగా సంభాషణ అకస్మాత్తుగా ధనం కలిసివచ్చిన వారి కథల్లోకి దిగింది. ఆకథలన్నీ బాగా ప్రచారంలో ఉన్నవి ఒక్క కథను పోలినవే అన్నీను పారిస్‌లో అగ్గిపెట్టెలు అమ్ముకునేవాడు కోటీశ్వరుడెలాగయినదీ, 'ఒకాయనకు భూమిలో పాతినధనం ఎలాగు లభించినదీ, కొందరు కొందరు జూదాలలో గెలుపొందడం, మరికొందరు అదృష్టం కలసొచ్చి లక్షాధికారులకు అల్లుళ్ళు కావడం— ఈ కథలన్నీ ఒకదాని వెంక ఇంకొకటి వెలువడ్డాయి.

ఈ సంభాషణ అంతటినీ ఎంతో శ్రద్ధగా ఆలకిస్తూన్నాడేగానీ మాలిగన్ ఒక్క మాట కూడా అనలేదు. సహజమైన అతని ఆకారంలో అనేక భావనలు పుట్టిన కారణంగా విన్నవన్నీ తన స్వంత అనుభవాలు కింద మారుతున్నాయి. అప్పులిచ్చిన కథలు, అనుకోని భాగ్యాలు, లక్షాధికారులనే విచిత్రవ్యక్తులు, ఏ చిన్న సరదానయినా మరి పోలనివారి స్వభావాలు మాలిగన్‌ను చాల ఉద్రేకపరచాయి. అంతకన్న, ఆ సమయంలో తాను అల్పమైన నాలుగు రూకలకోసం కక్కుర్తి పడుతున్నాననే భావం అతన్ని చాలా క్రుంగదీసింది

"కొందరికి దారిలో ధనం లభిస్తుంది!" అన్నాడు—మాలిగన్ అకస్మాత్తుగా తన మాటలకు తానే ఆశ్చర్యపోతూ

అందరూ అతని వైపే చూశారు. అంతవరకు మాలిగన్ ఒక్కమాటకూడా అనియుండలేదు. మాలిగన్ కంగారుపడి వికారమైన తన చూపుల్ని "టేబిల్ క్లాతు" మీదకు దించేసుకున్నాడు

"అందుకు సందేహం లేదు. దారిలో డబ్బు దొరుకుతుంది! కాని అది ఇంకొకళ్ళ జేబుల్లో మాత్రం ఉంటుంది!" అని అసిస్టెంటు పోలీసు ఇన్‌స్పెక్టరు చమత్కరించాడు.

అందరూ ఒక్కమారుగా విరగబడి నవ్వడం ప్రారంభించారు. ఇన్‌స్పెక్టరు ధలోక్తికి కన్న మాలిగన్ ఆకృతి వారిని ఎక్కువ వినోద పరిచింది. అయితే సంభాషణ సాగిపోతూంది ఈమారు పెద్ద లూటీలు, ఈనాటి వరకూ పట్టుబడకుండా ఉన్న దొంగతనాలు గురించిన కబుర్లకు మారింది. మళ్లీ మాలిగన్ కళ్లముందు వందలకొద్దీ వేలకొద్దీ లక్షలకొద్దీ రూపాయలు నాట్యంచేస్తున్నాయి. పెద్దపెద్ద నోట్ల కట్టలు ప్రత్యక్షమవుతున్నాయి.

తమకు ఎంత ఆస్తి ఉన్నదో కూడా లెక్క మరిచిపోయిన భాగ్యవంతుల అద్భుతమైన పేర్లు వినబడుతున్నాయి. ఈ కథలన్నీ వింటున్న మాలిగన్ స్థితి వంటగది దగ్గర నిలబడ్డ ఆకలిగొన్న వాని చందంలో ఉంది.

'రంగ్' మన్న గడియారపు ఒక్కగని ఒక్కమోత వారికి రాత్రి ఒంటిగంటయిందన్న సంగతిని తెలియజేసింది. ఫాదర్ డికాన్ లేచి తన పొడుగాటి చొక్కాచేతుల్ని మీదికి ఎత్తుకుంటూ అందరి దగ్గరా శెలవు తీసుకున్నాడు. వెంటనే మిగతావారుకూడా లేచారు. మాలిగన్ మాత్రం తన చోటునుంచి కదల్లేదు. రాకిటిన్ అతిథుల్ని ఒక్కరొక్కర్నే కావ్యోత్తి వెలుగుతో దారి చూపుతూ వారి దగ్గర శెలవు పుచ్చుకుంటున్నాడు. అంతసేపూ మాలిగన్ యథాస్థానంలో అలాగే కూర్చున్నాడు టేబిల్ మీదనున్న రొట్టిముక్కల్ని వణుకుతున్న తన చేతివేళ్లతో ఇటూ అటూ తిప్పుకున్నాడు ఆలోచన పూర్వకంగా.

"రాకిటిన్ ఇంక ఒక్కనిమిషంలో వస్తాడు. అతన్ని తప్పక అడుగుతాను ఈమాత్రం సాహసం చెయ్యకపోతే ఎలాగు? ఇంతమాత్రానికే అతడు నన్ను కొరుక్కుని తినడు కదా?"

రాకిటిన్ తిరిగి వచ్చాడు. తన మిత్రుని పక్కనే కూర్చున్నాడు. అందరితోపాటు ఇతడుకూడా ఎందుకు వెళ్లలేదా అని ఆశ్చర్యపడుతున్నాడు. మాలిగన్ కూడ తన పనేదో వెంటనే చెప్పక ఏదో అర్థంలేని పెద్ద సంభాషణ ప్రారంభించాడు. ఆఫీసు పని, జీతాలు మొదలైన విషయాలు మాటాడుతున్నాడు. రాకిటిన్ అతనివైపే నిద్రకళ్లతో చూసాడు. అతని మాటలు శ్రద్ధగా వింటూన్నట్టే నటిస్తూ నోటికి చెయ్యి అడ్డంగా పెట్టుకొని నెమ్మదిగా ఆవులించాడు. అరగంట గడిచింది. చివరకు రాకిటిన్‌కి విసుగెత్తి పెద్దగా ఆవులిస్తూ లేచాడు.

"క్షమించాలి, రేపు మళ్లీ నేను పనిలోకి వెళ్లాలి" అన్నాడు

మాలిగన్ గడబిడగా లేస్తూ క్షమాపణ చెప్పుకుంటున్నాడు.

వీధిగుమ్మందాక వచ్చేసి తలుపుగడియమీద చెయ్యివేసి జరిగిపోతున్న తన సంకల్పాన్ని నిలుపుకుంటూ రాకిటిన్‌వైపు తిరిగి నేలవైపు చూస్తూ బిగుసుకొని పోతున్న గొంతుకతో—

"నాది ఒక చిన్నకోరిక ఉంది" అన్నాడు.

"ఏమిటది?" అన్నాడు రాకిటిన్ కొంచెం బరువుగా.

"మీకు తెలియకపోవచ్చు. నిజంగానే చెప్తున్నాను. మిమ్మల్ని మొహమాట పెట్టడం కాదుగానీ - ఇంటిదగ్గర పురిటిరోజులు. తప్పనిసరి. మీకు మళ్ళీ చెల్లించుకుంటాను గానీ, నాకు ఏమయినా సహాయం చేస్తారేమో అని" పది రూబెల్సు అడుగుదామనుకుని అంత డబ్బు అడిగేందుకు భయపడి—

"ఒక్క ఐదు రూబెల్సు ఇప్పిస్తే.."

"నాదగ్గర దమ్మిడీఅయినా లేదు" అన్నాడు రాకిటిన్. నమ్మకం వీపు కలిగించడానికి మాలిగన్ తట్టాడు.

"ఇల్లంతా గాలించినా ఒక్క దమ్మిడీ అయినాలేదు." రాకిటిన్ అంత నొక్కినొక్కి చెప్తున్న మాటలకు అర్థం మాలిగన్‌కు బోధపడక పోలేదు. తనదగ్గర డబ్బు ఉండి కానీ ఇవ్వడానికి జంకుతున్నాడు. రాకిటిన్ ఏదో సాకు చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. మాలిగన్ వీధిముఖం పట్టాడు.

వెన్నెలరాత్రి నిశ్శబ్దంగా బిగులుగా ఉంది. మంచు పాదాల మీద గోతులు పడ్తూంది. మాలిగన్ చాలాదూరం వెళ్ళాలి. డబ్బును గురించిన ఆలోచనమాత్రం మాలిగన్‌ను విడువలేదు. కొద్దిసేపట్లో తాను చలితో నిండియున్న తన కొంపకు చేరుకోబోతున్నాడనే తలంపు ఆయన్ని భయపెట్టింది. తన ఇంట కిటికీలు అద్దాలు విరిగి. ఊచలూడిపోయి చలిగాలిని ఇంట్లోకి స్వేచ్ఛగా ప్రవేశించడానికి పిలుస్తున్నాయి ఆ ఇంట్లో దారిద్ర్యం మళ్లీ దుర్గంధం వ్యాపించింది. పిల్లల గుడ్డలు తోళ్లవలె ఉన్నాయి. ఒక ప్రక్క ఆత్రుతతోనూ మరి ఒక ప్రక్క నిస్పృహతోనూ డబ్బుకోసం అడిగే భార్యకు ఏమని జవాబు చెప్పడం? తానేమో విందారగించాడు. కొద్దిగా మద్యముకూడా సేవించాడు. వారో? ఇంటిదగ్గర పస్తులు పడుతున్నారు. తను డబ్బు తీసుకొస్తాడన్న ఒక్కటే ఆశ వారికి.

"ఓయి భగవంతుడా, ఇది నీ కేమి ధర్మంగా ఉంది? ఇతరులకి సౌఖ్యాన్ని ఇచ్చావు. వారి కావలసినదల్లా ఇచ్చావు. కాని నన్ను మాత్రం మరచిపోయావు కొందరికి కొన్ని సమయాల్లో అవసరం లేకపోయినా డబ్బు దొరుకుతుంది. మరి నాకు ఒక్కమారు, ఒక్కమారయినా ఓ పదో పాతికో దొరకదేమి?

"మంత్రసానికి ఇచ్చుకుందును. మా పెద్దపిల్లకి బూట్లు, చిన్నదానికి గౌనులు కొందును. ఈ నిమిషాన్ని ఈ రోడ్డుమీద నాకు ఒక పర్సు దొరకకూడదా? ఒకొక్కప్పుడు అలా దొరకడంకూడా కద్దు. ప్రజలు అటువంటి విషయాలను గురించే ఎక్కువగా వ్రాస్తుంటారు. చెప్తుంటారు."

ఒక్కక్షణంలో మాలిగన్ తన ఊహాశక్తి ప్రభావంవల్ల కొత్త లోకంలో విహరింపసాగాడు. ఆ భావనాలోకంలో అతని కొక పెద్ద పర్సు దొరికింది. దాన్ని అతను తెరిచినప్పుడు అందులో వందలూ, వేలూ విలువచేసే నోట్లు ఉన్నాయి. లాటరీ టిక్కెట్లు ఉన్నాయి. తానొక పెద్దయింటికి మార్చేసాడు ఆ ఇంట్లో ఎంతో వెచ్చగా ఉంది. ఎంతో హాయిగా ఉంది. ఇంటినిండా ఇంపైన సామాను. పిల్లలందరికీ వెచ్చని ఉన్నిగుడ్డలు. ఇంకా అనేక వస్తువులు. డబ్బు సంపాదించగల ఎన్నో ఉపయోగకరమైన వస్తువులు కొన్నాడు.

విందులో సేవించిన వోడ్కా (మద్యము) ప్రభావంవల్లనో, తాను కల్పించుకున్న ఊహాల ప్రభావంవల్లనో మాలిగన్‌కు ఆ రాత్రి, ఆ నిమిషాన్ని, అక్కడే ఒక పర్సు దొరుకుతుందన్న నమ్మకం దృఢమైపోయింది. ఆ ఊహ ఎంత తెలివిమాలినదని ఎందరు వాదించినా మాలిగన్‌కు ఆ నిమిషాన్ని కల్గిన నమ్మకాన్ని తప్పించడానికి ఎవరితరమూ కాదు. ఎందుచేత అతనలా ఊహించుకున్నాడో మనకు తెలీదు. అతనికే తెలీదు. తనకు తప్పక రోడ్డుమీద పర్సు దొరుకుతుందని విశ్వసించాడు. తలవంచి నేలను పరీక్షగా చూస్తూ నడుస్తున్నాడు

"ఇక్కడ, ఇప్పుడు, ఈ క్షణము" అని తనలో తాను గొణుగుతున్నాడు—మతిపోయినట్టు, నిజంగా తనకు లభించినట్టు—మరికొన్ని అడుగులు—అప్పుడే—అక్కడే—వెంటనే రోడ్డుమీద ఒక పర్సు అగుపడింది. ఇదేమీ అతను కల్పించుకున్న ఇంద్రజాలంకాదు. స్పష్టంగా రోడ్డుమీద మంచులో మిలమిలా మెరుస్తూ అరచేతి దళసరిని పర్సే!

ఆత్రుతతో ఆందోళిత హృదయంతో ఆయాసపడినట్లు అయాడు మాలిగన్. అతని వెంట్రుకలు లేచి నిలుచున్నాయి. నాలుగు వైపులా భీతితో కలియచూశాడు దొంగవలె. ఒక్కపరుగున వెళ్ళి ఆ నేలమీద నున్న వస్తువును చేత చిక్కించుకొని మీద కెత్తాడు.

అతని చేతుల్లో అదొక దళసైన పెద్ద పర్సుగా సాక్షాత్కరించింది. తన కలలకు వాస్తవానికి ఆకస్మికంగా కలిగిన ఈ అద్భుతమైన మేళవింపు మాలిగనును కొంతసేపటివరకు ఆచేతనుణ్ణి చేసింది. కాని చేతిలోఉన్నది పర్సే అన్న సంతృప్తితో మాలిగన్ దాన్ని గుండెలకు గట్టిగా అదుముకొని ఇంటివైపు పరుగుతీసాడు.

(16 వ పేజీ చూడుడు)

నారసింహలేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలత, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

(పి. సి. ఏ. & కంపెని. పెరిదేపి—నెల్లూరు జిల్లా

బ్రాంచి: 7 సీనుమెంబలి వీధి, మద్రాసు.

సాహిత్యమీమాంస:



మహాకవి త్రివిక్రమభట్టు

శ్రీ సాలగ్రామ కాశీవిశ్వనాధశర్మ

కావ్యము వస్తురుచిరత్వంచే, నిరతిశయాహ్లాద ప్రభుత్వంచే నితాంతరమణీయభవంబైన దగుచున్నది. దీనికి రుచిరత్వంబు యెందుకు గల్గదు? స్వప్రకాశానంద స్వరూపంబైన, బ్రహ్మానందాస్వాద సమానమైన రసమే ఆత్మ గదా? కనుకనే రసికులు సహృదయులు అమంద కావ్యానందమును పొందుచున్నారు. తదితరుల మాట వేరు వచింపబనిలేదు. ఎట్లన—

"కవితారసపరిపాకం
వ్యాసుభవరసికో విజానాతి"

ఈవిధంగా లోకోత్తర వర్ణనా నిపుణుడైన, కవికర్మకర్తయైన కవియందు మహాభారము కలదనిన సందేహము లవలేశము లేదు. ఈక్రింది ఉదాహరణము చెప్పక చెప్పుచున్నది. చూడుడు—

న స శబ్దో న తచ్ఛాస్త్రం
న స న్యాయో న సా కలా,
జాయతే యన్న కావ్యాంగ
మహో! భారో మహాన్ కవే:!

మన సంస్కృతవాఙ్మయంలో మిక్కిలి మహాకవులు విచిత్ర రచనా చాతురీ దురీణ చమత్కృతచేతస్కులు పుట్టిరి. వారియందు మహాకవి త్రివిక్రమభట్టునుగురించి, గురుముఖతః వినినదానిని మిక్కిలి కౌతుకముతో ఆంధ్ర పత్రికాపాఠకులకు నివేదించుచున్నాను.

సంస్కృత భాషలో యీ కవి స్వప్రౌఢి ప్రకర్షచేత చేతశ్చమత్కారి కవితా నైపుణ్యం చేతను, అగ్రస్థానాన్ని అలంకరించిన ప్రౌఢతర మహాకవుల స్థానాన్ని పొందుచున్నాడనుట కినుమంతయు సందియంబు లేదు.

ఈ కవి దేవాదిత్యపుత్రుడు. హైదరాబాదు ప్రాంతస్థ ఖేటాధీశ్వరునియొక్క సభలో ప్రధాన కవి; ప్రముఖపండితుడును. ఆ ఖేటాధీశ్వరుడు యింద్రరాజనృపతి. 915 క్రీస్తుశకమున ఉండెనని బరోడారాజ్యాంతర్గత 'నవసారి' గ్రామమున పొందబడు తామ్రశాసనములనుబట్టి తెలియుచున్నది.

ఇంద్రరాజుయొక్క స్వీయరాజ్యాభిషేక సమయమందు యే బ్రాహ్మణులకు విరివిగా యివ్వబడియుండెనో, వారియొక్క దానపట్టాలలో దేవాదిత్యకుమారుడు త్రివిక్రముడని వ్రాయబడియుండెను. అదియుగాక త్రివిక్రముడున్నూ స్వీయగ్రంథమందు స్వవంశవరిచయాన్ని యిచ్చుచు వ్రాయుచున్నాడు:

"తేషాం వంశే ప్రథితయశసాం
శ్రీధరస్యాత్మజోఽభూ
ద్దేవాదిత్యః స్వమతివికస
ద్వేదవిద్యావివేకః,
ఉత్కల్లోలాం దిశిదిశి జనా
కీర్తిపీయూషసింధుం
యస్యాద్యాపి శ్రవణపుటకైః
కూణితాక్షాః పిబంతి.
తైస్తైరాత్మగుణైర్యేన
త్రైలోక్యతిలకాయితం
తస్మాదస్మి సుతో జాతో
జాడ్యపాత్రం త్రివిక్రమః"

ఈ మహాకవి 'దమయంతీ' కథను నలచంపు అనుపేరుతో గద్యపద్యమయంబైన సభంగ శ్లేషభంగి తరంగితంబైన ప్రౌఢతమంబగు కావ్యమును నిర్మించెను. అందు 337 పరిమితంబైన పద్యములు గద్యములు గలవు.

మన దేశంలో విశిష్ట మహాకవులయొక్క, పండితులయొక్క విషయంలో విశేషమాహాత్మ్య సూచకంబైన కథలు తరచుగా లభించుచున్నవి. కాళిదాసు, భారవి, శ్రీహర్షుడు మొదలైన కవుల విషయంలో కూడా ప్రచురప్రకారంబులైన ప్రవాదంబులు వినంబడుచున్నవి.

ఆ విధంబుగానే త్రివిక్రమభట్టు విషయంలో ప్రసిద్ధమైన కింవదంతి ఒకటి గలదు.

ఈ త్రివిక్రమభట్టు శాస్త్రానభిజ్ఞుడు, అవినీతుడు, మహామూర్ఖుడు. ఒకనాడు దేవాదిత్యుడు కార్యవశమున దేశాంతరమేగిన, ఒకానొక మహావిద్వాంసుడు ఖేటాధీశ్వరాస్థానంలోనికి వచ్చి, "రాజా! నీ సభయందు యెవనిచేనైనను నాతో శాస్త్రవాదమును చేయింపుము. లేదా, జయపత్రమును యిమ్ము" అని అడిగెను. రాజును దేవాదిత్యపుత్రుడైన త్రివిక్రమభట్టును పండితుడనే నిశ్చయించి పిలిపించెను. మన త్రివిక్రమ భట్టు, రాజాజ్ఞ విని విషణ్ణహృదయుండై మానరక్షణకొఱకు వాగ్దేవిని ప్రార్థించెను. సరస్వతియు అతనికి ప్రత్యక్షంబై యెంతవరకు నీ తండ్రి రాడో, అంతవరకు నీ ముఖమందు అందునని వరమిచ్చెను. ఆ వరప్రభావముచేత ప్రతివాదిని జయించి స్వగృహంబునకు నివృత్తుడయ్యెను. పితురాగమనముకంటె పూర్వమే గద్యపద్యమయంబైన చంపూకావ్యమును రచించెను. సప్తమోచ్ఛ్వాసము సమాప్తముగుటతోడనే పితురాగమనకారణం చేత సరస్వతి వెడలిపోయెను. ఆ కారణంచే సముదర్భము సంపూర్ణమై యుండెను.

ఈ కింవదంతి పూర్ణంగా కల్పితమని పాఠకులకు తోచకమానదు. ప్రస్తుతః, యీ మహాకవి బాల్యమునుండి యథావిధిగా సకలసాహిత్య శాస్త్ర తదంగశాస్త్రాధ్యయనము చేసినవాడును, సమస్తక్షోణభూభాగములు తిరిగినవాడును. రాజోచితాచార విచారవ్యవహార కుశలుడున్నూ. లెస్సగా అనుభవించిన సంసారసారము గలవాడును, బహుశ్రుతుడు, బహుదర్శి, పరమ మార్మికుడు, విద్వద్ధురీణుడని దృఢముగా చెప్ప శక్యమగుచున్నది.

త్రివిక్రమభట్టు తరుచుగా బాణభట్టు ననుకరించుచున్నాడు. బాణభట్టుచే శుకనాసోపదేశము ఏ రీతిగా రచింపబడినదో ఆ విధముగానే యీ కవిచే సాలంకాయనోపదేశము చక్కగా వర్ణింపబడినది. దైవయోగముచే కాదంబరి అసంపూర్ణమై యుండినటులనే ఈ చంపుకూడా అసంపూర్ణముగానే యుండెను.

ప్రకృతి వర్ణనమందు సిద్ధహస్తుడైన మహాకవి త్రివిక్రమభట్టు వన-పర్వత-నదీ-వృక్ష-చంద్ర-సూర్య-ఆకాశ-నక్షత్రాదులయొక్క వర్ణనమందు కుండినపుర-విదర్భదేశాది వర్ణనమందును, అంతట ప్రఖరతరంబైన మర్మసంబంధమైన ప్రతిభ ప్రతిఫలిస్తుంది.

లౌకికమందును యీ మహాకవికి గల మహత్ ప్రావీణ్యము ప్రతిపదంబున ఉట్టిపడుచున్నది. పరస్పరసంభాషణ, లోకోక్తులు కవిచే సరసముగా యథాయోగ్యముగా ప్రయోగింపబడెను.

"ఇతో వ్యాఘ్రః; ఇతస్తటీ, హృదయతృణకుటీరే దీప్యమానే స్మరాగ్నా వుచితమనుచితం వా వేత్తికః పండితోఽపి."

మొదలైన లోకోక్తులు మిక్కిలి లభ్యమగుచున్నవి.

'కర్ణాటీమివ, ముఖరతాం న ప్రశంసంతి సుధియః.'

మొదలైన గూఢదేశాచారములు కవిచే వర్ణింపబడినవి. సంగీతశాస్త్రమందు, చిత్రకళయందు కవికి గల మహాత్పాండిత్యము ప్రతిస్థానమందు ద్యోతితమగుచున్నది.

'హరచరణసరోజ' శబ్దము ప్రత్యుచ్ఛ్వాసాంతమందు ప్రయోగించుటంచేత యీ చంపు హరచరణసరోజాంకితమని తోచకమానదు కవియు శైవుడను సంకల్పము దృఢమగుచున్నది.

ఏకవచన బహువచనముల, స్త్రీలింగ పుంలింగముల యేకాధికరణ్యం మొదలగు ప్రయోగకుశలతచే వ్యాకరణ శాస్త్రమందు గల పాటవము త్రివిక్రమునిచే ప్రకటింపబడింది.

అలంకారమందు కవి భ్రాంతిమదలంకార ప్రియుడు. సాహిత్యదర్పణాది లక్షణ గ్రంథములందు భ్రాంతిమదలంకారమునకు త్రివిక్రముని ఉదాహరణములే లభ్యమగుచున్నవి.

ఈ కవికులచూడామణి సంస్కృత సాహిత్యమున సభంగశ్లేషవిషయమున అద్వితీయుడు. కవి ప్రప్రథమమున స్వగ్రంథమందు వ్రాయుచున్నాడు.

వాచః కాఠిన్య మాయాంతి
భంగశ్లేషవిశేషతః
నోద్వేగ స్తత్ర కర్తవ్యో
యస్మాన్నైకో రసః కవేః.

భంగశ్లేషవశమున వినిమీదటను సద్యోరసాస్వాదమునకు ప్రతిబంధక మగుచున్నది. అయినప్పటికిని యీ కవియొక్క శ్లేషప్రయోగము సరల - సరసమగుటచే సద్యః కాలముననే సహృదయుల మానసముల నానందింపజేయుచున్నది. సంస్కృత సాహిత్య ప్రపంచమున యిట్టి ప్రౌఢతరసరస శ్లేషకవి మరియొకడు కానరాడు.

సంస్కృతమున కొంతమంది మహాకవులకు ఒక్కొక్క అనుపమోపమయంబులైన ఉపనామంబులు, దీపశిఖా కాళిదాసు - ఆతపత్ర భారవి - ఘంటామాఘుడు - తాలరత్నాకరుడు - మొదలయినవి ప్రసిద్ధంబులు, ఈ రీతిగా యీ కవికిని 'యమునాత్రివిక్రమ' అని ప్రసిద్ధి పాఠకులకు విశదమే.

కవులచే భూమిపై యెక్కడో అక్కడ గంగాయమునాసంగమవర్ణనము చేయుట కద్దుట్టు చున్నది. కాని ఆకాశమందు గంగాయమునా సంగమము కవిచే వర్ణింపబడుచు కల్పనాశక్తియొక్క మహత్పరిచయము యివ్వబడుచున్నది —చూడుడు:

ఉదయగిరిగతాయాం
ప్రాక్ప్రభాపాండుతాయాం
గతవతి చ నిశీథే
శృంగమస్తాచలస్య,
జయతి కిమపి తేజః
సాంప్రతం వ్యోమమధ్యే
సలిల మివ విభిన్నం
జాహ్నవం యామునం చ

ఈ కావ్యమందు తద్ధిత ప్రయోగబాహుళ్యముచే "ప్రియతద్ధితా దాక్షిణాత్యాః" అను లోకోక్తి సర్వదా స్మరణకు రాకమానదు.

నైషధకారుడైన మహాకవి శ్రీ హర్షుడు నలచంపువందుగల త్రివిక్రమునియొక్క కావ్య రచనా వైచిత్రిని ఆలోకించియే రభసవశముచేత మహాద్భుత మహాకావ్యమును నిర్మించెను.

ఈ దమయంతీ కథనే ఆయా స్థానములందు వృద్ధిపొందించుచు, తగ్గించుచు స్వీయవాగ్వైదగ్ధ్యమును ప్రదర్శించుచు నలచంపును పూర్తి చేసెనని తోచకమానదు. ఎక్కడో అక్కడ రచనాపరిపాటి పాటవంచేత ఉత్కృష్టతరముగా చేసెను. హంసనలసమాగమమందు, వాని దౌత్యమందు, దమయంతీ హంససమాగమమందును త్రివిక్రమునియొక్క తుటిపూరణమే చేసెనని తోచకమానదు. నలుని దూత్యమును సవిశేషచమత్కారముగా రచించెనని తెలియదగినది.

ఈ త్రివిక్రమభట్టు నిజమహత్వ కవిత్వపటుత్వముచే భారతీయ కవి సమాజంలో అగ్రస్థానమును పొందుచున్నాడనుటకు వేరు వచింపబనిలేదు.

కోటీశ్వరుడు

(11 వ పేజీ తరువాయి)

అరమైలు దూరాన్ని ఇల్లు ఉంది. ఇంత దూరం పరుగుత్తాలి. ఎప్పుడూ పరుగెత్తే అలవాటు లేదు తనకి. గొంతుక ఎండిపోతూంది. ప్రక్కలలో నొప్పి బయలుదేరింది. రక్తం వడిగా ప్రవహిస్తూంది. గుండెలు కొట్టుకుంటున్నాయి. తలకాయ తిరుగుతూంది. కాని మాలిగన్ ఆగలేదు. ఆలస్యంచేస్తే ఎవరయినా ఎదురొచ్చి తన నిధి కొల్లగొట్టారేమో!

ఆ పరుగులో అతని టోపి కిందపడిపోయింది. వంగి తీసుకోవాలన్న ఆలోచన తనకు తట్టింది. కాని దాన్ని తనదారిని వదిలేసి పరుగెత్తు తున్నాడు "ఇలాటివి వెయ్యిటోపీలు కొనుక్కోవచ్చు!" అన్న మాటలు మాలిగన్ నోటినుండి వెలువడి గాలిలో కలిసిపోయాయి. ఇంటితలుపు దబదబ బాదగానే భార్య వచ్చి తలుపు తీసింది. చేతిలో కొవ్వొత్తిదీపం పట్టుకొని నిలుచుంది. ఆ వెలుగులో ఆ ముఖంమీద భయంతో కూడుకున్న విషాదచ్ఛాయల్ని మాలిగన్ గమనించలేదు. పిల్లలుకూడ లేచారు. తండ్రి వాలకాన్ని చూసి భయపడి పక్కలకే అంటుకపోయారు.

మాలిగన్ కుర్చీలో కూలబడ్డాడు—నీరసపడి, చెమటలు కారుస్తూ, మెరుస్తున్న కళ్ళను తిప్పుకుంటూ.

"ఓయ్ పిల్లలారా, ఇదుగో చూడండి. పర్సు. ఇందులో డబ్బు—వందలూ, వేలు ఉంది. పెద్దఇల్లు, దాసీలు, తాగేందుకు 'షాంపేన్' నాలుగు మిలియన్ల రూపాయలున్నాయి. తెలిసిందా! అహా!"

ఈనాడు మాలిగన్ పెద్ద కోటీశ్వరుడు. అతని సంపత్తుతో సరిపోల్చితే ప్రపంచంలో గల్ల నిధులన్నీ దిగదుడుపే! అతనివద్ద అరవై వేల గుర్రాలున్నాయి. మూడు మిలియన్ల ఐదు వందల వేలు గుర్రలున్నాయి. ప్రపంచంలోగల అన్ని రైళ్వేలకు ఆయన డైరక్టరు. కొత్తగా భూమి నుండి బృహస్పతి వరకు వేసిన రైలుదారికి కూడా ఆయన డైరెక్టరే. అతడు బహు ఉదార స్వభావుడు. అడిగిన ప్రతి దరిద్రునకి ఒక మిలియను కు తక్కువకాకుండా దానం చేస్తాడు. అతడు చాల గౌరవనీయుడు. మర్యాదస్థుడు. కాని ఒక్క విషయం మాత్రం ఆయన సహించలేడు. అతని పర్సు ఎవరేనా తాకేరా అంటే ఆయనకు పట్టరాని కోపం వస్తుంది. అందులో ఒక మూడు రుపాయిల నోటు, ఒక లగ్గేజీ రసీదు, పేపర్లోని అడ్వెర్టైజుమెంటు ముక్క ఉన్నాయి. కోపం వచ్చినప్పుడు ఆయన తన చుట్టూ గుమిగూడి ఉన్న ప్రజలమీద తనచేతికి ఏది దొరికితే అది తీసుకొని విసిరి కొడతాడు.

అతని భార్య పిల్లలుకి అతనిమీద ఎంతో భక్తి. అతను కోరినదల్లా వారు కాదనకుండా ఇస్తారు. అతను కూడా వాటిని ఆదరంగానే చూస్తాడు.

ఇంతకీ మనమేమిటి చెప్పగలం? ఒక్కొక్కప్పుడు మనకన్న పిచ్చివాళ్లే ఎక్కువ సౌఖ్యవంతులేమో అనిపిస్తూంటుంది.

రాళ్లు అమర్చిన రిస్టువాచి రు 20/8



స్విస్‌మేడ్. సరిగా టైంచూపును. ప్రతీదీ 3 ఏళ్ల గ్యారంటీ.గుండ్రం లేక చతురం క్రోమియంకేసు రు. 20/8 మేలిరకం రు. 25/- బిల్లపరుపు ఆకారం క్రోమియంకెసు రు. 30/- రోల్డుగోల్డు (10 సం. గ్యారంటీ) రు. 55/- 15 రాళ్ల క్రోం కేసు రు 38/- 15 రాళ్ల రోల్డుగోల్డు రు. 75/- రెక్టాంగ్యులర్, వంపుగలది లేక టాను ఆకారము క్రోమియం కేసు రు. 42/- మేలిరకం రు. 45/- రోల్డుగోల్డు (10 సం గ్యారంటీ) రు. 60/- రోల్డుగోల్డు 15 రాళ్ల రు. 30/- అలారం టైంపీసు. ధర రు. 18/-, రు. 22/- పెద్దసైజు రు. 25/- పోస్టేజి ఉచితము.
ఏరెండు కొనువారికైనా పోస్టేజి ఉచితము

H. DAVID & CO.,
Post Box No. 11424, CALCUTTA

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గింజా & కో, రాజమండ్రి